# లోగుట్టు పెరుమాళ్ళుకెరుక

పెరుమాళ్లు ఒక ఫేక్టరీలో ఎండీకి స్టెనోగా వున్నాడు. వాయిదాల పద్ధతిలో ఇల్లు కొనుక్కుని ఓ ఇంటివాడయ్యాడు. ఇప్పుడు నిజ జీవితంలోని ఓఇంటివాడు కావాలనే బుద్ధి పుట్టింది. ఇన్నాళ్లూ చెల్లికి పెళ్లి చేయాలనే బాధ్యతవల్ల తనకు ముప్ఫయేళ్లు నిండినా ముదిరిన బెండగానే వుండిపోవలసి వచ్చింది.

అయితే, తను వాయిదాల పద్ధతిలో కొనుక్కున్న ఇంటికి వాయిదాలు కట్టగలిగే అమ్మాయే కావాలి. వన్‌మంత్ అడ్వాన్స్ నోటీసు ఇచ్చేసి, సింపుల్‌గా రిజిస్ట్రేషన్ మేరేజ్ చేసుకుందికి సంసిద్ధుడే! కట్నం గిట్నం జాన్తానై!

అదేమిటోనండీ! కొందరు అమ్మాయిల తండ్రులికి కొన్ని వందల చెప్పుల జతలు అరిగిపోతాయి, కాబోయే జామాతల అన్వేషణలో. భూగోళం అంతా గాలించేస్తారు. తీరా చూస్తే తమక్కాబోయే అల్లుడు, ఇరుగునో పొరుగునో వుంటాడు. కానీ అతడు స్ఫురించడు-ఎవరో మధ్యవర్తులు చెప్పేవరకూ!

అలాగే అయింది, పెరుమాళ్లుకు అర్ధాంగి కాబోయే మంగతాయారు తండ్రికి.

మంగతాయారు పెరుమాళ్లు పనిచేస్తున్న ఫేక్టరీలోనే క్లర్కుగా పనిచేస్తోంది. ఆమె తండ్రి తన కుమార్తె వరాన్వేషణలో ఆంధ్రదేశమంతా గాలించాడు. పత్రికా ప్రకటన చేయించాడు. కాబోయే ఏ వియ్యంకుణ్ణుంచీ ప్రతిస్పందన లేదు.

"అదేమిటయ్యా! అంత దిగులుగా వున్నావు?" అని అడిగాడో మిత్రుడు మంగతాయారు తండ్రిని.

మంగతాయారు తండ్రి తన 'చింత' కు కారణం చెప్పాడు.

"చితా దహతి నిర్జీవం చింతా దహతి జీవనం - అని వ్యాస భగవానుడు ధర్మరాజుకి చెబుతాడు. 'చిత' అంటే అగ్ని నిర్జీవమైన శవాన్ని దహిస్తుంది. కాని 'చింత' వున్నదే? అది నిండు జీవనాన్నే దహిస్తుంది!

-అంచేత నువ్వు చింతించకయ్యా మిత్రమా! మీ అమ్మాయి పనిచేస్తున్న ఆఫీసులోనే పెరుమాళ్లు అనే ముప్పయేళ్ల స్టెనో గ్రాఫర్ వున్నాడు. సంప్రదించు" అన్నాడు.

మంగతాయారు తండ్రి తను నింపుతున్న గళ్ల నుడికట్టు ఆల్ కరెక్టు అయినట్టు గంతులు వేశాడు. పొడుపు కథకి సరియైన సమాధానం దొరికినంత సంబరపడిపోయాడు.

దేశంలో వున్న అన్ని ఫేక్టరీలలోలు ప్రభుత్వరంగ సంస్థలలోను, ప్రభుత్వోద్యోగులలోను రెండేసి ఉద్యోగుల యూనియన్లు వుంటూంటాయి. అందులో మంగతయారుకి సభ్యత్వం వున్న యూనియన్ నాయకుణ్ణి సంప్రదించాడు మంగతాయారు తండ్రి.

తమ యూనియన్ సభ్యుల జాబితాలో పెరుమాళ్లు పేరు వుందేమో అని చూశాడు యూనియన్ నాయకుడు. పెరుమాళ్లు పేరులేదు. రైవల్ యూనియన్‌లో సభ్యుడని తేలింది.

అయినా వివాహసంబంధానికి యూనియన్ రైవల్రీ ఏమిటి? కార్మిక సమస్యలపై యాజమాన్యంతో పోరాటానికి యూనియన్లు గాని!

పెరమాళ్లుకి చెందిన యూనియన్ నాయకుణ్ణి సంప్రదించాడు మంగతాయారు యూనియన్ నాయకుడు. ఉభయవర్గాల యూనియన్ నాయకులూ పెరుమాళ్లుకి మంగతాయారుకీ ఇంటర్వ్యూ ఏర్పాటు చేశారు. ఒకరితోనొకరు నిష్కర్షగా మొహమాటం లేకుండా మాట్లాడుకోమన్నారు యూనియన్ నాయకులు.

వివాహానికి ముందు స్త్రీ ఇంటి పేరు వేరు. వివాహానంతరం భర్త ఇంటి పేరు ఆమెకు వస్తుంది. ఆమె ఇంటిపేరు భర్తకు రాదు. ఇది పురుషస్వామ్య వ్యవస్థ. అంచేత ముందు పెరుమాళ్లునే మాట్లాడమని ఛాన్సిచ్చారు యూనియన్ నాయకులు.

"ఈ విషయంలో మీతో నేను ఏకీభవించను. స్త్రీ పురుష శిశువులకు జన్మనివ్వడం స్త్రీ యొక్క ప్రకృతి ధర్మం. ఏ స్త్రీ గర్భం లోంచి పురుషులు జన్మించారో అదే స్త్రీలకు వాళ్లు ఆంక్షలు విధించారు. ఇది తగని పని. ఈ విషయంలో 'గృహిణులను మీ మీ గృహాలకే పరిమితంకండి' అని సూచనలిచ్చిన భారత ప్రధాన న్యాయమూర్తే, దేశంలోని మహిళా సంఘాలు ఉద్యమించి నిరసన తెల్పగా, తమ వ్యాఖ్యల్ని ఉపసంహరించుకున్నారు.

అంచేత ఈ సందర్భంలో నాకే మొదట మాట్లాడే అవకాశం ఇవ్వాలి" పట్టుపట్టింది మంగతాయారు.

ఈ విషయంలో పెరుమాళ్లు అభిప్రాయం ఎలా వుంటుందో అని యూనియన్ నాయకులు అతని మొఖంవైపు చూశారు.

"నాకేం అభ్యంతరం లేదు. ముందు ఆమెనే మాట్లాడమనండి. ఎవరైతేనేం?"

ఇప్పుడు మంగతాయారు అంది:

"ఒకవేళ మనం ఉభయులం ఒకరి నొకరం నచ్చుకుని దంపతులమైతే - ఇప్పుడున్న మా ఇంటి పేరులో మార్పు వుండదు. యథాతథంగానే వుండాలి. మీ ఇంటి పేరు మార్చుకోమని నన్ను ఒత్తిడి చెయ్యకూడదు. నా గోత్రమే నాకుంటుంది. మీ గోత్రం మీకుంటుంది. దేవాలయాల్లో పూజలు చేయించుకున్నప్పుడు మీ గోత్రానామాలతో మీరు పూజ చేయించుకోండి. నాగోత్రనామాలతో నేను పూజ చేయించుకుంటాను. అర్చకుడు మీ పేరు ఉచ్చరిస్తూ 'ధర్మపత్నీ సమేతస్య" అంటాడనుకోండి. మొదటిసారి ఒప్పుకుంటాను. రెండోసారి 'ధర్మపతీ సమేతస్య' అని ఉచ్చరించమంటాను. అలా మీరోసారి నేనోసారి పూజలు చేయించుకుందాం. మీకు సమ్మతమేనా?"

మంగతాయారు చెప్పిన ఈ మాటలకి యూనియన్ నాయకులు అచ్చెరువొందారు. పెరుమాళ్లు మొహం చూశారు.

"నాకు పూర్తిగా సమ్మతమే! నేను ఫెమినిస్టుని" అన్నాడు పెరుమాళ్లు.

"నా వంతు చెప్పడమైంది. మీరు చెప్పవలసింది చెప్పండి" అంది మంగతాయారు.

పెరుమాళ్లు చెప్పాడు.

"మనిద్దరం చెరొక యూనియన్‌కి చెందిన కార్మికులం. వివాహానంతరం కూడా మనం ఇలాగే కొనసాగాలి. నన్ను మీ యూనియన్‌లోకి మారమని బలవంతం చెయ్యొద్దు. అలాగే మిమ్మల్ని మా యూనియన్‌లో చేరమని నేనూ బలవంతం చెయ్యను.

- ఈ సందర్భంలో ఒక ఉదాహరణ. సుప్రసిద్ధ గాంధేయుడు స్వాతంత్ర్య సమరయోధుడు అయిన ఆచార్య జె.బి. కృపలానీ ప్రజాసోషలిస్టు పార్టీలో వుండేవారు. ఆయన అర్ధాంగి శ్రీమతి సుచేతా కృపలానీ కాంగ్రెసు పార్టీలో వుండేవారు. ఆమె కొన్నాళ్లు యు.పి. ముఖ్యమంత్రి కూడా. అయినా వారు ఎట్టి పొరపొచ్చాలు లేకుండా సహజీవనం

సాగించారు. మనమూ అలాగే వుండాలని నా అభిమతం. మీ స్వేచ్ఛ మీది. నా స్వేచ్ఛనాది."

పెరుమాళ్లు నిజాయితీగా నిష్కర్షగా వెలిబుచ్చిన అభిప్రాయాలకి మంగతాయారు చలించిపోయింది. రోమహర్షణి అయింది. ఇంత మంచి మగని తనకు ఏడడుగులలో ప్రసాదిస్తున్నందుకు ఆ ఏడుకొండల వాడికి మనసులో అభివాదం చేసింది. ఆనందాబ్ధి తరంగాలలో ఓలలాడిస్తున్నందుకు అంతరంగంలో రంగనాథుణ్ణి స్మరించింది. మంచి పెనిమిటి రాకకై తన హృదయద్వారాలు తెరపించినందుకు ద్వారకాధీశుని సేవించింది. తన మనోమయూరి పురివిప్పి నాట్యం చేయడానికి దోహదించిన పురి జగన్నాథునికి ప్రణుతులిడింది.

"మీ అభిమతం నాకు సమ్మతమే! నా సవరణలేమీ లేవు" అంది మంగతాయారు. రెండు యూనియన్ల సభ్యులు హర్ష వర్షాన్ని కురిపించారు.

ముప్పయ్ రోజుల తర్వాత మేరేజ్ రిజిస్ట్రార్ సమక్షంలో పెరుమాళ్లు మంగతాయారుల వివాహం రిజిస్ట్రీ అయింది. రెండు యూనియన్ల నాయకులు సాక్షి సంతకాలు చేశారు.

ఆరు నెలలు పోయేక మంగతాయారు సభ్యురాలుగా వున్న యూనియన్ వాళ్లు సమ్మె చేశారు. పెరుమాళ్లు సభ్యుడుగా వున్న యూనియన్ వాళ్లు సమ్మెలో పాల్గొనలేదు. ఉత్పత్తి కుంటుపడలేదు.

సమ్మె విఫలమైంది.

మరో ఆరు నెలలు పోయేక పెరుమాళ్లు సభ్యత్వం వున్న యూనియన్ వాళ్లు రెణ్ణెల్లపాటు సమ్మె చేశారు.

మంగతాయారుకు సభ్యత్వం వున్న యూనియన్ వాళ్లు సమ్మెలో పాల్గొనలేదు.

ఈ సమ్మె కూడా విఫలమైంది.

ఒక పీఠాధిపతి తన అనుచరగణంతో శిష్య సంచారానికి బయలుదేరి ఊరూరా తిరుగుతున్నారు. ఆయా శిష్యులు తమకు గల ఆర్థిక స్తోమతలనుబట్టి పీఠాధిపతికి ఆయన పరివారానికి ఆతిథ్యం ఇస్తున్నారు. పాదకట్నాలు సమర్పించుకుంటున్నారు.

ఇలా కూడబెట్టిన పాదకట్నాలతో ఓ బంగారు పెరుమాళ్లు విగ్రహాన్ని చేయించారు

గురువుగారు. ఏ ఊళ్లో ఏ శిష్యుని ఇంటికి బిక్షకి వెళితే ఆ శిష్యుని ఇంట్లో ఆ విగ్రహాన్ని దాచమని ఇచ్చేవారు. వెళ్ళి పోయేటప్పుడు ఆ పెరుమాళ్ల విగ్రహాన్ని అడిగి తీసుకునేవారు.

ఒకనాడు ఒకనిరుపేద అయిన ఛాత్రుని ఇంట్లో బస చేశారు గురువుగారు తన పరివారంతో. ఆ విగ్రహాన్ని దాచమని ఇచ్చారు శిష్యునికి. గురువుగారికి, వారి పరివారానికి ఆతిథ్యం ఇస్తూనే వున్నాడు శిష్యుడు. గురువుగారికి ఆశ్చర్యం వేసి ఓ రోజు అడిగారు:

"శిష్యా! ఇంత నిరుపేదవై ఉండి మమ్మల్నందర్నీ ఎలా ఆదరిస్తున్నావో చోద్యంగా వుంది."

శిష్యుడు వినయంగా అన్నాడు: "లోగుట్టు పెరుమాళ్ళకెరుక!"

శిష్యా! మరి మేము ఇంకో ఊరు వెళ్లాలి. నీకు నేనిచ్చిన పెరుమాళ్ళ విగ్రహాన్ని ఇచ్చెయ్" అన్నారు గురువుగారు.

శిష్యుడు విగ్రహాన్ని తెచ్చి ఇచ్చాడు. అది చాలా తేలికగా వుంది.

"శిష్యా! నేనిచ్చిన విగ్రహం ఇంత తేలిగ్గా వుందేం?" ఆందోళనగా అడిగారు గురువరేణ్యులు.

"లోగుట్టు పెరుమాళ్లకెరుక" అన్నాడు శిష్యపరమాణువు అతి వినయంగా.

పెరుమాళ్ల విగ్రహంలోని బంగారాన్ని అడుగు నుంచి డొలిచేసి, గురుశిష్యులందరికీ సమారాధన చేస్తూ వచ్చాడని గురువుగారికి అర్థమైంది.

అలాగే - ఫేక్టరీలోని స్టెనోగ్రావర్ అయిన పెరుమాళ్లు కూడా, భార్య మంగతాయారు సమ్మె చేసినప్పుడు, తను చేయలేదు గనుక, కుటుంబ పోషణ చేసుకుంటూ, వాయిదాల పద్ధతిలో కొన్న ఇంటికి అంతరాయం లేకుండా వాయిదాలు కట్టుకున్నాడు.

పెరుమాళ్లు సమ్మె చేసినప్పుడు, తన భార్య మంగతాయారు సమ్మె చేయలేదు గనుక, కుటుంబ పోషణ కుంటుపడకుండా, తన భర్త వాయిదాలమీద కొన్న ఇంటికి ఆమె నిరంతరాయంగా వాయిదాలు కట్టింది.

సమ్మెలో పాల్గొన్న ఇతర కార్మికులు జీతాల్లేక చేసిన అప్పుల్ని వడ్డీతో సహా వాయిదాలు కట్టుకుంటున్నారు.

కుటుంబపోషణ కుంటుపడకుండాను, వాయిదాల పద్ధతిలో కొన్న ఇంటికి

నిరంతరాయంగా వాయిదాలు చెల్లించుకుంటూ ఇంటిని నిలబెట్టుకుందికి గాను, "మీ యూనియన్‌లో నేను చేరను, మా యూనియన్‌లో మిమ్మల్ని చేరమని బలవంతం చెయ్యను. మీ స్వేచ్ఛ మీది. నా స్వేచ్ఛ నాది" అని ప్రజాస్వామ్య సూత్రాలు వల్లించాడు పెరుమాళ్లు!

తనే పెరుమాళ్లు కావడంవల్ల ఈ లోగుట్టు తనకే తప్ప ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డాడు.

స్వాతి మాసపత్రిక నవంబరు 1992